# తెలంగాణను తెర్లు చేసుకోవద్దు



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

జగిత్యాల, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)/మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్, కోరుట్ల రూరల్ : కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లోకి పోనివ్వవద్దని, తెలంగాణను తెర్లు చేసుకోవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రజలు గెలుస్తారని, ప్రజల బతుకులు బాగుంటాయని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్‌ను గెలిస్తే కేవలం ఆ పార్టీలు మాత్రమే గెలుస్తాయన్నారు. కారు గుర్తుకు ఓటేసి నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు గెలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు మద్దతుగా బండలింగాపూర్, వెల్లుల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, అయిలాపూర్ గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి రోడ్డుషోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల కవిత ప్రసంగిస్తూ.. గ్రామాల్లో చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయన్నారు. చెరువులు ఎండినప్పుడు కప్పలు ఆ చెరువును విడిచి వెళ్లిపోతాయని, చేపలు మాత్రం చెరువు ఎండినా.. నిండినా అక్కడే ఉంటాయన్నారు. బీఆర్ఎస్ వాళ్లు చేపల్లాంటి వాళ్లని, కాంగ్రెస్, బీజేపీ వాళ్లు కప్పల వంటి వాళ్లని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం బీజేపీ ఎప్పుడూ మాట్లాడలేదని, సీఎం కేసీఆర్ దీక్ష చేసేంత వరకు ఒక్కరూ మాట్లాడలేదన్నారు. ఉన్న తెలంగాణను ఆంధ్రలో కలిపింది కాంగ్రెస్ వాళ్లే అన్నారు. నాడు తెలంగాణ కావాలని అడిగితే 369 మందిని ఇందిరమ్మ కాల్చి చంపించిందన్నారు. కేసీఆర్ ఉద్యమించి, చావునోట్లో తలబెట్టి పోరాటం చేస్తే 1200 మంది పోరాటయోధుల ఆత్మత్యాగాల తర్వాత కాంగ్రెస్ వారితో పాటు, కేంద్రం మెడలు వంచి తెలంగాణ తెచ్చుకున్నామన్నారు. చెరువులు ఎండినా నాడు ప్రజలతో బీఆర్ఎస్ ఉందని, ఇప్పుడు చెరువులు నిండిన సమయంలో సైతం ప్రజలతోనే బీఆర్ఎస్ ఉందన్నారు. కష్టంలో ఉన్నప్పుడు మనతో ఉంటేనే మనవాడు అవుతాడని, సంతోషంగా ఉన్నప్పుడు, సంపద ఉన్నప్పుడు మాత్రమే మన వెంట ఉండేవాళ్లు మనవాళ్లు కాదన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు తెలంగాణలో చీకట్లు అలుముకుంటాయని, నీళ్లు రావని, కరువు ఉంటుందని, నక్సలైట్ల రాజ్యం అవుతుందంటూ, ఆంధ్రా ప్రాంతం వాళ్లు విమర్శలు చేశారని, కానీ సీఎం కేసీఆర్ పదేండ్ల పాలనలోనే తెలంగాణను అన్నిరంగాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్ది వాళ్ల నోళ్లు మూయించారని చెప్పారు. ఒక్క చిన్న అవినీతికి తావు లేకుండా పని చేస్తే అగ్రగామిగా రాష్ట్రం నిలిచిందన్నారు. రైతుల గురించి, ఇక్కడి ప్రజల గురించి ఏనాడూ ఒక్కరు పట్టించుకోలేదని, అలాంటి వారి కోసం సీఎం కేసీఆర్ పట్టించుకున్నారన్నారు. రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ లాంటి పథకాలను రూపొందించారన్నారు. మహిళల నేతృత్వంలో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేసే పద్ధతిని ప్రారంభించామని, గతంలో పాలకులు ఒక్క గింజా అయినా కొనుగోలు చేశారా..? అని ఆమె ప్రశ్నించారు. చరిత్ర మరిచిపోతే మళ్లీ ఆగమవుతామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. బీడీ కార్మికుల పెన్షన్లకు కటాఫ్ డేట్ తీసేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, ఎన్నికల తర్వాత మూడోసారి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు తీసుకోగానే, బీడీ కార్మికులందరికీ పెన్షన్లు వస్తాయన్నారు. అన్ని వర్గాల వారికి సీఎం కేసీఆర్ మద్దతిస్తున్నారని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపరీతంగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచితే, దాన్ని తగ్గించడానికి సీఎం కేసీఆర్ కృషి చేశారని, రూ.400కే సిలిండర్ ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారన్నారు. కేసీఆర్ బీమా, ప్రతి ఇంటికి ధీమా పేరిట ప్రతి పేద కుటుంబానికి బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ సంకల్పిస్తే, బీమా ఎందుకని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయని, అందరూ బాగుండాలనే ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామని చెప్పారు. "ఒక పార్టీ వాడు వచ్చి చచ్చిపోవాలని అంటాడు. బీఆర్ఎస్ వాళ్ల తలకాయ తీసేయాలని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఇవేం మాటలు. ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బీఆర్ఎస్ వారికి మర్యాద ఉన్నది, బీజేపీ, కాంగ్రెస్ వారికి మర్యాద లేదని ఆమె విమర్శించారు. రైతుబంధు మొత్తాన్ని పెంచాలని కూడా సీఎం కేసీఆర్ సంకల్పించారని చెప్పారు. బీఆర్ఎస్ గెలిస్తే ప్రజల భవిష్యత్తు బాగుంటుందని, తెచ్చుకున్న తెలంగాణను తెర్లు చేసుకోవద్దని, తెలంగాణను దొంగల చేతిలో పెట్టవద్దన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ వంద మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కానీ ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ చెప్పినవన్నీ చేశారని, కాంగ్రెస్, బీజేపీ వాళ్లు మాటమీద నిలబడేవాళ్లు కాదన్నారు. బీఆర్ఎస్ గెలిస్తే ప్రజల బతుకులు బాగుంటాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే ఆ పార్టీలే గెలుస్తాయని, బీఆర్ఎస్ గెలిస్తే ప్రజలు గెలుస్తారని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో దక్షిణ భారత దేశంలో తొలిసారి హ్యాట్రిక్ సీఎం అయ్యి కేసీఆర్ రికార్డు సృష్టిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో నిమ్స్ దవాఖానలో సంజయ్ వెంటే ఉండి తమకు ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. సంజయ్ తనకు సోదరుడిలాంటివారని, ఈ ప్రాంత బిడ్డ అని, భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బండలింగాపూర్ ఎన్నికల ప్రచారంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ సాయి రెడ్డి, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

### అయిలాపూర్‌ను మండల కేంద్రంగా చేస్తాం

కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రజా అభీష్టం మేరకు అయిలాపూర్‌ను మండల కేంద్రంగా చేసేందుకు సీఎం కేసీఆర్‌ను ఒప్పించే బాధ్యత తీసుకుంటానని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కోరుట్ల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ గ్రామమైన అయిలాపూర్‌లో జరిగిన రోడ్డులో షోలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆమె పాల్గొన్నారు. అంతకుముందు అయిలాపూర్‌లో రోడ్ షోకు హాజరైన కవితకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచ్ పిడుగు రాధ, పీఏసీఎస్ చైర్మన్ చింతకుంట సంజీవరెడ్డి, ఎంపీటీసీలు బోడ గంగాధర్, చింతకుంట వనిత, యూత్ మండలాధ్యక్షుడు నత్తి రాజ్‌కుమార్, మండలాధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అబద్ధపు ప్రచారాలకు ఆగం కావద్దు : సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి



రాష్ట్రంలో 65 ఏళ్లలో జరుగని అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో కేవలం తొమ్మిదేళ్లలో జరిగింది. ఇవన్నీ మన కళ్ల ముందే కనబడుతున్నాయి. చేసిన అభివృద్ధి, అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తుంటే, ప్రతిపక్షాలు మాత్రం కేవలం అబద్ధపు ప్రచారాలు చేస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నయి. యువతకు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే. ప్రతిపక్షాల ఝూటా ప్రచారానికి ఆగం కావద్దు. ఆలోచనతో ఓటుహక్కు వినియోగించుకోవాలి. బీజేపీ తరపున నిజామాబాద్ నుంచి వచ్చిన అర్వింద్ పోటీ చేస్తున్నడు. కాంగ్రెస్ నుంచి హైదరాబాద్‌లో స్థిరపడ్డ నర్సింగరావు బరిలో ఉన్నడు. నేను మాత్రం మెట్‌పల్లిలోనే పుట్టిన. ఇక్కడి బిడ్డగా పోటీ చేస్తున్నా. ఒకసారి ఆగమై బీజేపీకి ఓటేస్తే ఈ ఐదేండ్లలో మీ గ్రామాలకు ఒక్కసారైనా వచ్చిండా ఆలోచన చేయాలి. కాంగ్రెస్ అభ్యర్థి ఎప్పుడో ఐదేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాడు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని ఇక్కడ కనిపిస్తున్నడు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పర్చాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతోనే నేను ఎన్నికల్లో పోటీచేస్తున్నా. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న మీ బిడ్డ కావాలా.. పరాయి బిడ్డ కావాలా మీరే ఆలోచించుకోవాలి.

### సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి : దావ వసంత, జడ్పీ చైర్‌పర్సన్



కూరగాయాలు కూడా మనం ఏరి ఏరి జాగ్రత్తగా కొంటాం. అలాంటిది ఓటు వేసే ముందు ఎంత విజ్ఞత ప్రదర్శించాలో ఆలోచించుకోవాలి. ఒకసారి ఆగమై ఓటు వేస్తే ఎంపీగా గెలిచిన వ్యక్తి సంస్కారహీనంగా మాట్లాడుతున్నాడు. డా. సంజయ్ మంచి సంస్కారవంతుడు. మన ఓటును సంస్కారవంతునికి వేద్దామా.. సంస్కారహీనునికి వేద్దామా..? ప్రజలే నిర్ణయం తీసుకోవాలి. కారు గుర్తుకు ఓటేసి డా. సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

### పసుపు బోర్డు ఎక్కడుంది అర్వింద్.. : విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే



ఎంపీగా గెలిచిన వ్యక్తి తెచ్చినానని చెప్పుకుంటున్న పసుపుబోర్డు ఎక్కడ ఉందో ప్రజలకు తెలపాలి. సత్తా ఉంటనే నాయకులవుతారు. నోటికిష్టమొచ్చినట్లు మాట్లాడే వారు ఎప్పటికీ నాయకులు కాలేరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. బీజేపీ అభ్యర్థి పడమటి నుంచి, కాంగ్రెస్ అభ్యర్థి తూర్పు నుంచి వచ్చారు. నా బిడ్డ డా. సంజయ్ మాత్రమే స్థానికుడు. ఇక్కడే పుట్టాడు. ఇక్కడే ఉంటాడు. ప్రజలందరూ కారుగుర్తుకు ఓటేసి సంజయ్‌ను గెలిపించి, కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేయాలి.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విద్యాసాగర్‌రావు

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

**మెట్‌పల్లికి చెందిన యువకులకు కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు**

మెట్‌పల్లి, నవంబర్ 16: మెట్‌పల్లి పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి విద్యాసాగర్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నామని, కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి మార్గం గంగాధర్, చంద్రమాణిక్యం, మోరపు గంగాధర్, కుత్బొద్దీన్, ఆకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

## కారు.. ప్రచార జోరు

**గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం**



మెట్‌పల్లి: మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న సరోజన

మెట్‌పల్లి, నవంబర్ 16: బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు మద్దతుగా ఆయన తల్లి సరోజన పట్టణంలోని 3, 4వార్డుల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష అని, అభివృద్ధి, సంక్షేమం కోసం కారుగుర్తుకు ఓటు వేసి తమ కొడుకు సంజయ్ కల్వకుంట్లను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజా త, కౌన్సిలర్లు బర్ల మధులత, ఎనగందుల వనజ, ఉజగిరి లక్ష్మి, గైని లావణ్య, మాజీ కౌన్సిలర్లు ద్యావతి అరుణ, గజం లక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ జరుపుల భారతి, నాయకులు లింగంపల్లి సంజీవ్, బర్ల రమేశ్, అరిసె మురళి, ద్యావ తి నారాయణ, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, నవంబర్ 16: పట్టణంలోని 25వ వార్డు గాంధీరోడ్డులో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సతీమణి కల్వకుంట్ల దీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యతో కలిసి గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. మహిళలతో కలిసి బీడీలు చుట్టారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాన్ని అందజేసి పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ఆమె వివరించారు. ఇక్కడ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, పుప్పా ల ఉమాదేవి, బలిజ పద్మ, కో ఆప్షన్ సభ్యురాలు రెంజర్ల కల్యాణి, మాజీ కౌన్సిలర్ గంధ్ర శిల్పారావు, సేనాపతి రాజు, బీఆర్ఎస్ నాయకులు మేన్నేని శ్యామల, గుర్రాల ప్రవీణ్, తదితరులున్నారు.

కోరుట్ల రూరల్, నవంబర్ 16: ధర్మారం, అయిలాపూర్ అనుబంధ గ్రామమైన కిషన్‌రావుపల్లె గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సోదరి సమత స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ, మ్యానిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే పలు సంక్షేమ పథకాలను తెలియజేశారు. గడపగడపకూ వెళ్లి వివరిస్తూ కారు గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీపీ తోట నారాయణ, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూప, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నత్తి రాజ్‌కుమార్, సర్పంచు ఇప్ప మంగ, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి సుభాష్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.